విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 29,అక్టోబర్ 2023

హెచ్ఎల్‌సి ఆయకట్టుకు డిసెంబర్ వరకు నీరు వదలాల్సిందే

విశాలాంధ్ర-బొమ్మనహాల్: తుంగభద్ర ఎగువ కాలువ కింద వేలాది ఎకరాల్లో వరి మిరప జొన్న తదితర పంటలు సాగు చేశారని, ఈ పంటలకు డిసెంబర్ వరకు నీరు అవసరమని, హెచ్ ఎల్ సి అధికారులు నవంబర్ 10న నీరు బంద్ చేస్తే రైతులు పూర్తిగా నష్టపోతారని, డిసెంబర్ వరకు సాగునీరు విడుదల చేయాలని రాయదుర్గం నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి ఎం.నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బొమ్మనహాల్ ఆంధ్ర సరిహద్దున తుంగభద్ర ఎగువ కాలవను పరిశీలించారు. హెచ్ఎల్సీ కాలువలు తగ్గిన నీటిని పరిశీలించారు. అనంతరం సిపిఐ నాయకులు రైతులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడుతూ వచ్చేనెల నవంబర్ 10తారీకున నీరు బంద్ అని అంటున్నారు. హెచ్.ఎల్.సి నీరు తగ్గుముఖం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకుంటామని ఇప్పటికే ప్రకటించారు. దీంతో హెచ్ ఎల్ సి ఆయకట్టు కింద ఉండే రైతులు దాదాపు 20వేల ఎకరాల పంటలు కోల్పోయే పరిస్థితి ఉ.ఏర్పడతాయి డిసెంబర్ వరకు అయినా వదిలితే పంటలు చేతికి అందేపరిస్థితి. దీని వల్ల కోట్లు నష్టపోయే పరిస్థితి మెట్ట భూముల సాగు కూడా పంటలు చేతికి రాని పరిస్థితి స్థానిక అధికారులు గానీ నాయకులు గానీ ఎవరు వెళ్లి రైతులనుదృష్టిలో పెట్టుకుని హెచ్ ఎల్ సి డ్యామ్ దగ్గర వెళ్లి మాట్లాడిన పాపానపోలే కావున ప్రభుత్వం స్పందించి డిసెంబర్ నెల ఆఖరి వరకు నిలిచే విధంగా చర్యలు తీసుకోవాలీ అని అన్నారు. ఏపి రైతు సంఘం తిప్పేస్వామి, తాలూకా కార్యదర్శి రైతు సంఘం అధ్యక్షులు నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం ధనుంజయ, సిపిఐ రమేష్, నాగరాజు, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను వేదిస్తే సహించం

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: ఏ సంస్థలోనైనా పై అధికారులు క్రింది స్థాయి ఉద్యోగులను వేధిస్తే సహించేది లేదని సీపీఐ అనుబంధం ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రాజా రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. నిన్నటి రోజున సెంట్రల్ మెడికల్ స్టోర్స్ పనిచేస్తున్న ఆంజనేయులు అనే డ్రైవర్ ఆత్మహత్య ప్రయత్నం చేసుకోవడం బాధాకరమన్నారు. కార్మికులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే బాధితులకు ఏఐటీయూసీ అండగా ఉంటుందన్నారు. క్రింది స్థాయి ఉద్యోగులను పైస్థాయి అధికారులు వేధిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని రాజారెడ్డి తెలిపారు. వేధింపులు ఎదురైనప్పుడు ఇలాంటి ప్రయత్నాలు ఎవ్వరూ చేయొద్దని కార్మికులకు సూచించారు.ప్రభుత్వ రంగ సంస్థల్లో కార్మికులు ఎవరైనా ఇబ్బందులకు గురైతే పోరాటం చేయాలని వారికి ఎఐటియుసి అండగా ఉంటుందని అన్నారు. ఆంజనేయులు ఆత్మహత్య ప్రయత్నం చేసుకోవడానికి ప్రేరేపించిన వెంకటరమణయ్య ను సస్పెండ్ చేసేంతవరకు ఏఐటియుసి పోరాటం ఆగదని రాజరెడ్డి తెలిపారు.

రైతులను మోసగించిన వీఆర్ఏపై తక్షణ చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - నార్పల : నార్పలమండల పరిధిలోని హెచ్. శోధన పల్లి పంచాయతీలో రైతులను మోసగించిన డబ్బు కాజేసిన వీఆర్ఏ సత్యనారాయణ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో శనివారం వామపక్ష పార్టీ నాయకులు తాసిల్దార్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలోను వీఆర్ఏ సత్యనారాయణ ఇలాంటి చర్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారులు ఉదాసీన వైఖరితో వీఆర్ఏ పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల సంబంధిత వీఆర్ఏ తరచూ అక్రమాలకు పాల్పడుతున్నాడని తెలిపారు. తాసిల్దార్ హరికుమార్ ఈ విషయంపై స్పందిస్తూ వీఆర్ఏ పై విచారణ చేసి నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర,సిపిఎం కార్యదర్శి కుల్లాయప్ప,సిపిఐనాయకులు సుధాకర్, సిఐటియు కార్యదర్శి చంద్రమౌళి, పెద్దిరాజు,పెయింటర్ రాజు,గోపాల్ పాల్గొన్నారు.

ప్రజలను రక్షించడం మా కర్తవ్యం

పోలీసు అమర వీరుల త్యాగాల స్ఫూర్తితో రక్తదానం చేసిన జిల్లా ఎస్పీ



విశాలాంధ్ర - అనంతపురం వైద్యం: ప్రజలను రక్షించడంతో పాటు ప్రాణాలను నిలబెట్టడం మా కర్తవ్యమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో జిల్లా ఎస్పీ రక్తదానం చేశారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ఈరోజు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు (ఏ.ఆర్), ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు,పోలీసు డాక్టర్ వెంకటేశ్వర ప్రసాద్, ఐఎంఏ అనంతపురం బ్రాంచి అధ్యక్షులు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ శంకర్ గౌడ్, రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ మోహన్ కృష్ణ, సి.ఐ లు విశ్వనాథచౌదరి, ఆర్ ఐ లు హరికృష్ణ, రాముడు, పలువురు ఎస్సైలు, ఆర్ ఎస్ ఐ లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో పని చేస్తున్న వారికే గుర్తింపు

విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి పరిటాల సునీత

విశాలాంధ్ర - రాప్తాడు : గత కొన్ని రోజులుగా పార్టీలో ఎవరు పని చేస్తున్నారో ఎవరు చేయడం లేదో తాను అన్నీ గమనిస్తున్నానని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలంలోని తిరుమలదేవర దేవస్థానం వద్ద రాప్తాడు నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్ ఛార్జి వైకుంఠం మల్లికార్జున, రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల కమిటీల ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు, పోలింగ్ బూత్ ఇన్ ఛార్జిలు, యువత, మహిళలు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన టీడీపీ కార్యకర్తల ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాల మౌనం పాటించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి డిసెంబర్ 15వరకు జనంలోకి వెళ్లే విధంగా ప్రణాళిక చేశామని, 45రోజుల పాటు పార్టీ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో కుటుంబ సాధికార సభ్యుని వద్ద నుంచి నాతో సహా అంతా జనంలో ఉండాలన్నారు.మనం పార్టీ కోసం పని చేస్తూ.. నిత్యం జనంలో ఉంటూ చంద్రబాబును మరోసారి సీఎంగా చేసుకుందామన్నారు.

సీపీఐ పార్టీలో చేరికలు

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని సిపిఐ కార్యాలయం వద్ద శనివారము పలువురు ప్రజాసంఘాల నాయకులు సిపిఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ సిపిఐ పార్టీలో చేరిన వారికి సిపిఐ పార్టీ, ఏఐటియుసి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా నూతనంగా సిపిఐలో చేరిన వారు మాట్లాడుతూ సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కారం చేయడంలో ముందున్నారన్నారు. పేదల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేస్తున్నాడన్నారు. ఆయన చేసే కార్యక్రమాలకు మెచ్చి తాము కూడా సిపిఐ పార్టీలో ఉంటూ ప్రజలకు సేవ చేసుకోవాలని సిపిఐ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీరాములు ఏఐటియుసి నాయకుడు ఉమా గౌడ్, పార్టీలో చేరిన రైటర్ బాబు, రాజు, నాగేంద్ర, సూర్యచంద్ర పాల్గొన్నారు.

ఎంపీపీ రాజీనామా

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ ఎంపీపీ చందా చంద్రమ్మ తన పదవికి రాజీనామా చేశారు. శనివారం అనంతపు రంలోని జెడ్పి ఇన్చార్జి సీఈవో జాయింట్ కలెక్టర్ కేతన్గర్కు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. రెండు సంవత్సరాల తర్వాత వైస్ ఎంపీపీ నరసింహులు కు ఎంపీపీ పదవి ఇవ్వాలని గతంలో పార్టీ పెద్దలు నిర్ణయించిన ప్రకారం రెండు సంవత్సరాల ఎంపీపీ పదవీకాలం పూర్తి చేసుకున్న చంద్రమ్మ రాజీనామా చేసినట్టు తెలిసింది. వైస్ ఎంపీపీ నరసింహులు కు ఎంపీపీ పదవి బాధ్యతలు అప్పగించడానికి పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు తెలిసింది.

ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించండి

విశాలాంధ్ర-ఉరవకొండ: వ్యవసాయ కార్మికులు వలసలు వెళ్లకుండా ఉండేందుకు తక్షణమే ఉపాధి పనులను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెన్నరాయుడు సిపిఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున పేర్కొన్నారు. శనివారం ఉరవకొండ పట్టణంలోని శివరాం రెడ్డి కాలనీలోనే సచివాలయంలో కార్యదర్శికి విన్నతపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపి పార్టీ వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు పార్వతీ ప్రసాద్, స్థానిక మహిళా సంఘం నాయకులు వన్నూరమ్మ, నాగలక్ష్మి, సంజమ్మ వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

రీసర్వేలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తిచేసేందుకు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డికి వివరించిన జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: విజయవాడ నుంచి శనివారం ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులు, రెవెన్యూ, రీసర్వే, జాతీయ రహదారులకు భూ సేకరణ, ఎంపీఎఫ్సి గోడౌన్ లకు భూ కేటాయింపు, వ్యవసాయం, పశు సంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, హౌసింగ్, ఇంటి పట్టాలు,ఇళ్ల నిర్మాణం, పీఆర్, ఆర్బీ ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ - వేజ్ జనరేషన్, స్వామిత్ర, జల్ జీవన్ మిషన్, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్లోని వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రీ దేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా జిల్లాలో మూడవ దశలో 35,088 స్టోన్ ప్లాంటేషన్ చేపట్టాల్సి ఉందని, సకాలంలో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇప్పటికే మూడవ దశలో ఎనిమిది గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో సిపిఓ అశోక్ కుమార్ రెడ్డి,పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డిఆర్డిఏ మరియు హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రూప్లనాయక్,జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజా రావు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రమణ్యం,డిసిఓ ప్రభాకర్ రెడ్డి, స్పందన తహసీల్దార్ వాణిశ్రీ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ ఇహషాన్ బాషా, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలంటూ డిఐజికి వినతి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండల జర్నలిస్టు ఈశ్వర్ పై దాడిని ఖండిస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డికి ఏపీయూడబ్ల్యుజే వినతి పత్రం అందించింది. శనివారం స్థానిక డిఐజి కార్యాల యంలో ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ నేతృత్వంలో వినతి పత్రం అందించారు.గోరంట్లలో ఈనెల 27న గుర్తు తెలియని దుండగులు జర్నలిస్ట్ ఈశ్వర్ పై విచక్షణ రహితంగా మారణాయుధాలతో దాడి చేశారని డీఐజీకి విన్నవించారు.రాజకీయ ప్రేరేపిత దాడిగా కుటుంబ సభ్యులు ఆరోపిస్తు న్నారని జర్నలిస్టుపై దాడి చేసిన వారు ఎంతటి వారైనా గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఇచ్చిన పిర్యాదుపై స్పందించిన డిఐజీ అమ్మిరెడ్డి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను గుర్తించే పనిలో ఉన్నామని దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలేది లేదన్నారు.సమాజంలో ఓర్పు,సహనం అవసరమని జర్నలిస్టులు కూడా వివాదా లకు తావు లేకుండా వార్త కథనాలు ప్రచురించాలని డిఐజీ సూచించారు. వార్తలు ప్రచురించిన పత్రిక యజమానుల పైన, విలేకరుల పైన దాడులు సరికాదని ఏమైనా ఉంటే న్యాయపరంగా వెళ్లాలని సూచించారు.దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని డిఐజి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఐజేయూ సభ్యులు ప్రభాకర్ నాయుడు, ఏపీయూడబ్ల్యుజే. జిల్లా ఉపాధ్య క్షులు కరణం తిప్పేస్వామి, లింగప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు జగదీష్, ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దానియల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా సహాయ కార్యదర్శి రవీంద్ర, ఉపాధ్యక్షులు వలి సాబ్, సభ్యులు మల్లికార్జున శర్మ,బాబా ఫక్రుద్దీన్,రామాంజనేయులు,యోగానంద పాల్గొన్నారు.

ఎంపీ గోరంట్ల మాధవ్ చిత్రపటాలు దహనం

మాజీ ఎమ్మెల్యే అరెస్ట్

విశాలాంధ్ర - కళ్యాణదుర్గం : టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు చనిపోతాడంటూ అనుచిత వ్యాఖ్య లు చేసిన హిందూపురం మంత్రి గోరంట్ల మాధవ్ చిత్రపటాలను కళ్యాణ దుర్గంలో శనివారం రాత్రి టిడిపి శ్రేణులు దహనం చేశారు.టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరితో పాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి స్టేషన్ తరలించారు. అచంద్రబాబు పై ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యల పట్ల

క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు స్థానిక టీ సర్కిల్లో ఆందోళనకు దిగారు. గోరంట్ల మాధవ్ చిత్రపటాలను పట్టుకొని ఆయనకు వ్యతిరేకంగా నినదిస్తూ కాల్చివేశారు. ఈ సంఘటనను స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల కు,టీడీపీ కార్యకర్తలకు తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు మాజీ ఎమ్మెల్యే హనుమం తరాయచౌదరిని అరెస్ట్ చేసి స్టేషన్ తరలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు శివశంకర్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిఎల్ హరికృష్ణ,జిపి నారాయణ, మల్లివల్లి నారాయణ, ఎర్రం నాయుడు, బసవరాజు,సాయి,ఎర్రంపల్లి సత్తి, పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై ఎమ్మెల్యే కేశవ్ ఆగ్రహం

విశాలాంధ్ర-ఉరవకొండ: బావులు బోర్ల కింద రైతులు సాగుచేసిన పంటలకు రోజుకు నాలుగు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని దీనివల్ల రైతులు సాగు చూసిన పంటలు ఎండిపోతున్నాయని విద్యుత్ శాఖ అధికారులపై ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలపైన ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై విడపనకల్లు మండలానికి చెందిన రైతులు ఎమ్మెల్యే వద్ద తమ బాధను వ్యక్తం చేయడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే శనివారం విడపనకల్లు మండలం మాలాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శించారు. అక్కడ విద్యుత్ శాఖ ఏఈ లేకపోవడంతో ఫోన్లో విద్యుత్ ఏఈ పై ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 9 గంటలు ఇవ్వాల్సిన కరెంటు కనీసం నాలుగు గంటలు కూడా ఇవ్వకపోతే రైతులు ఏ విధంగా పంటలను కాపాడుకుంటారని ప్రశ్నించారు. రైతులందరూ కూడా రాత్రంతా కరెంటు కోసం పొలంలోని ఎదురుచూస్తున్నారని అన్నారు. 9 గంటలు విద్యుత్ సరఫరా చేసి రైతుల పంటలు కాపాడాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

బిగ్బాస్కెట్,కంపెనీ ఉద్యోగులు ఘరానా మోసంతో రైతులు బలి

విశాలాంధ్ర - శింగనమల : మండల పరిధిలోని లోనూరు క్రాస్ సమీపంలో గల బిగ్ బాస్కెట్ కంపెనీ లీలలు ఒక్కొక్కటిగా బయట కుపొక్కుతున్నాయి. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ రైతులను బురిడీ కొట్టిస్తూ రైతులను మోసం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది రైతుల నుండి తక్కువ రేట్లకు పండ్లను కొనుగోలు చేసి కంపెనీకి అధిక మొత్తంలో అమ్ముతూ వచ్చిన మొత్తాన్ని రైతుల ఖాతాల్లో కాకుండా సిబ్బంది బినామీల ఖాతాల్లో జమ చేయిస్తూ రైతులను నట్టేట ముంచి కోట్ల రూపాయల సొమ్మును బిగ్ బాస్కెట్ కంపెనీ నిర్వాహకుల1.60కోట్ల రూపాయలు కుచ్చుటోపి పెట్టారని,కంపెనీ ఉద్యోగుల బంధువుల పేరు మీద ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి ఉద్యోగులు, జేబులో నింపుకున్నారని, గత కొంతకాలంగా బిగ్ బాస్కెట్ గొడౌన్ మూత వేయడంతో కంపెనీ ఉద్యోగుల అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకొస్తు న్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా కంపెనీ నిర్వాహకులు స్పందించి రైతుల రుణాలు చెల్లించే విధంగా కృషి చేసి రైతులను మోసం చేసిన కంపెనీ ఉద్యోగులను కఠినంగా శిక్షించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు ,

కరువు మండలంగా ప్రకటించాలి

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్

విశాలాంధ్ర-యాడికి : యాడికి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని,ప్రతి రైతుకు పంటల వారీగా నష్టపరిహారం అందించాలని శనివారం జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు వెంకట రాముడు యాదవ్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఓబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.యాడికి మండల కేంద్రంలోని సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెంకట రాముడు యాదవ్, ఓబిరెడ్డి మాట్లాడుతూ 2023 ఖరీఫ్ సీజన్లో మండల వ్యాప్తంగా రైతులు పత్తి, వేరుశనగ, జొన్న, ఆముదం, కొర్ర,కంది,సద్ద, వాణిజ్య ఆహార పంటలు జూన్ నెలాఖరునుండే పంటలు సాగు చేశారు కానీ సకాలంలో వర్షాలు లేక రైతులు వేసిన పంటలు ఎండిపోయాయి, పంటలు నష్టపోయిన ప్రతి రైతుకుపంట నష్ట పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి వడ్డే రాముడు, సిపిఐ సీనియర్ నాయకులు గరిడి శివన్న, సిపిఐ నాయకులు బాల నాయుడు, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

బస్సు యాత్ర దేనికోసం..?

విశాలాంధ్ర - అనంతపురం : సీఎం జగన్ నా ఎస్సీ నా ఎస్టీ నా బీసీ నా మైనారిటీ అని పదేపదే ఒక వల్లె వేస్తున్నారని, వారికి ఏం చేశారని, ఎందుకోసం సామాజిక బస్సుయాత్ర చేపట్టారో తెలపాలని టీడీపీ ఎస్సీ సంఘం నాయకులు సాకే వెంకటేష్, చిర్రోల్ల రామాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేశారని, కార్పొరేషన్ చైర్మన్లను ఉత్సవ విగ్రహాలుగా తయారు చేశారని విమర్శించారు. పేరుకే కార్పొరేషన్లని..ఒక్క పైసా కూడా వాటికి ఇవ్వకుండా ప్రజలను వంచిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని, మీరు ఎందుకోసం యాత్ర చేపట్టారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో అశోక్ కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మహర్షి యొక్క చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన గొప్పతనాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక వాల్మీకి కళ్యాణమండపం లోని మహర్షి విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు, ఉరవకొండ సర్పంచ్ లలిత, ఉపసర్పంచ్ వ న్నప్ప, మాజీ జెడ్పిటిసి సభ్యులు తిప్పయ్య, తేజ నాథ్, ఆ పార్టీ మరియు వాల్మీకి సంఘం నాయకులు ఉల్లిగప్ప,ముం దాస్ ఓబులేసు, నాగప్ప,రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, వన్నూరు సాహెబ్,సలీం, వార్డు సభ్యులు మల్లికార్జున, ఓబులమ్మ, వీరితోపాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన వాల్మీకి సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతపురం వైద్యం: రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలు ఆవరణలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. శ్రీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు.ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు (ఏ.ఆర్), ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజు, జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ శంకర్ మరియు సిబ్బంది, సి.ఐ లు ఇందిర, విశ్వనాథచౌదరి, ఆర్ ఐ లు హరికృష్ణ, రాముడు, పలువురు ఎస్సైలు, ఆర్ ఎస్ ఐ లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్,శివ, పాల్గొన్నారు.

రాప్తాడు: రామాయణ ఇతిహాసాన్ని రచించిన మహర్షి వాల్మీకి అందరికీ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం అనంతపురం కె.ఎస్.ఎన్ డిగ్రీ కాలేజీలో మహర్షి వాల్మీకి రాష్ట్రస్థాయి జయంతోత్సవం కార్యక్రమంలో పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, అనంతపురం వైసీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహాయ్య, ఏ.డి.సి.సి బ్యాంక్ చైర్మన్ లిఖిత, అమరావతి హాస్పిటల్ అంకె ముత్యాలన్న, రాప్తాడు నియోజకవర్గం మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్: మండలంలోని వివిధ గ్రామాల్లో వాల్మీకి సోదరులు శనివారం ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని గోవిందవాడ,ఉద్యహాల్, గోనెహాళ్ ,బొమ్మనహాళ్ ,నెమకల్ ,దర్గా పొన్నూరు, ఉం తకల్లు, కొలగనహళ్లి బండూరు తదితరగ్రామాల్లోని వాల్మీకి మహర్షి విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సోదరులు హనుమంతు రాయుడు, లోకేష్, సురేష్, వన్నూరు స్వామి, తలారి రాజశేఖర్, బంగి రామాంజనేయులు, గురు రాజ్ గౌడ్, లోకేష్, ఎస్ జి వన్నూరు స్వామి, గోరంట్ల రామాంజనేయులు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో శనివారం సిపిఐ మండల కార్యదర్శి నాగ రంగయ్య వాల్మీకి కులస్తులతో కలిసి ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. మొదటగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం పెద్దలు తోట చిన్న ఓబులేసు, ఎం. రామాంజనేయులు, ఈశ్వరయ్య, కంబగిరి, బాలయ్య, పెద్ద ఓబులేసు పాల్గొన్నారు.

శింగనమల: వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆత్మా రామాలయం దగ్గర వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గ్రామ ప్రజల సహకారంతో పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాల్మీకులు,పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని బోయవీధి లో అంకాలమ్మ గుడి వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి వాల్మీకి జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ ని గుంత తిరుపతి, మేకల రామచంద్ర పూల మాల శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బాలపెద్ద య్య, కంబగిరి, నారాయణస్వామి, రామాంజి బోయ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు జాతరను తలపించాయి. శనివారం బత్తలపల్లి మండలం ఈదుల ముష్టురు గ్రామంలో వాల్మీకి కులస్తులు ముందుగా బోనాలతో గ్రామంలో ఊరేగించి అనంతరం వాల్మీకి విగ్రహం ముందర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని బోనాలు చేపట్టారు ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు బోయ సాంబ, రామకృష్ణ, నారాయణ, శీనా, గోపాల, అలివేలమ్మ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 29,అక్టోబర్ 2023

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : టీడీపీ గెలుపు లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు పని చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు,కమిటీ సభ్యులందరితో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజల నడ్డి విరుస్తున్నాడని, నిత్యవసర సరుకులే కాకుండా సిమెంటు, ఇసుక, పెట్రోలు అన్ని విపరీతంగా రేట్లు పెంచేశారని సామాన్య ప్రజలు జీవించడం కష్ట సాధ్యంగా మారిందని,జగన్ పాలనతో విసిగిపోయిన ప్రజలు 2024లో టీడీపీ చంద్రబాబు కి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్లు,బూత్ కన్వీనర్లు,యూనిటీ ఇన్చార్జిలు,క్లస్టర్ ఇన్చార్జిలు ఇతర అనుబంధ సంఘ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రక్తదానం చేయండి జీవితాలలో వెలుగులు నింపండి

విశాలాంధ్ర-పుట్టపర్తి: రక్తదానంతో ఎన్నో ప్రాణాలు కాపాడడమే కాక వారి కుటుంబాలలో వెలుగులు నిలిపిన వారవుతామని ఎస్పీ మాధవ్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాల ఆవరణంలో ఆర్డీటీ వారి చేత రక్తదాన క్యాంప్ నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఎస్పీ గారి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ లలో, ఏఆర్ విభాగంలో విధులు నిర్వహించే పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లాలోని పౌరులు, ఆటో డ్రైవర్లు, ఇతర ప్రజలు మొత్తం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని జిల్లా ఎస్పీ స్వయంగా అభినందించి పళ్ళు, ఫ్రూట్ జ్యూస్ ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటు అక్టోబర్ 31వ వరకు జిల్లాలో నిర్వహించే "పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో పలు సేవా కార్యక్రమాలను పోలీసు వారు చేపడుతున్నారు. మనం దానం చేసే ప్రతి ఒక్క "రక్తపు బిందువు" మరొకరికి ప్రాణం పోసిన వారవుతామన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో జిల్లాలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం కొరత ఏర్పడకుండా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో సేవలందించిన డాక్టర్లను ఎస్పీ శాలువాత సన్మానించి మెమెంటోళ్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.విష్ణు,డీఎస్పీ వాసుదేవన్, ఏ.ఆర్ డి.ఎస్.పి విజయ్ కుమార్, ఏఓ సుజాత సిఐలు కొండారెడ్డి,రాజేంద్ర యాదవ్,ఆర్ఐలు టైటాస్ ,నారాయణ,జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా విడుదల

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాలు శుక్రవారం విడుదల చేయడం జరిగిందని, నియోజకవర్గంలో2,35,067 ఓటర్లు ఉన్నారని తహసిల్దార్ యుగేశ్వరి దేవి తెలిపారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ ధర్మవరం అర్బన్‌లో 1,02,075 ఓటర్లు, ధర్మవరం రూరల్ లో 33,314 మంది ఓటర్లు,తాడిమర్రి మండలంలో 23,810మంది ఓటర్లు, ముదిగుబ్బ మండలంలో 44,418 ఓటర్లు, బత్తలపల్లి మండలంలో 31,450 మంది ఓటర్లు కలరని తెలిపారు. ఈ నాలుగు మండలాలలో పురుషులు 1,17,050 మంది ఓటర్లు, మహిళలు 1,17,997 మంది ఓటర్లు, ఇతరులు 20 మంది ఓటర్లు వెరసి 2,35,067 మంది ఓటర్లు కలర నీ తెలిపారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వం లక్ష్యం

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వము యొక్క ముఖ్య లక్ష్యం అని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శాంతినగర్, లింగశెట్టి పాలెం సచివాలయాల వద్ద నిర్వహించారు. ఈ రెండు క్యాంపుల వద్ద 534 మంది రోగులకు వైద్య పరీక్షలను ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అదేవిధంగా 210 మందికి కంటి పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి కంటి అద్దాలు కూడా పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వము చేయని ఇటువంటి ఆరోగ్య పరీక్షలు నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వహించడం అది రోగులకు వరంగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డులకు సంబంధించిన కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణములోని తొగటవీధిలో గల చౌడేశ్వరి దేవి ఆలయ ఆవరణములో ఆదివారం ప్రముఖ డాక్టర్లచే 92వ ఉచిత వైద్య చికిత్స శిబిరమును నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి సంఘం వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరానికి దాతలుగా శీలం సావిత్రమ్మ,శీలం శ్రీరాములు, కుమారులు శీలం రమ్య నాగిని, శీలం జయ ప్రకాష్ లు వ్యవహరిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రముఖ వైద్యులైన వివేకులాయప్ప, వెంకటేశ్వర్లు, సాయి స్వరూప్, సుబ్రహ్మణ్యం పూజారి, నాగప్రసాదులచే వివిధ రకాల వైద్య చికిత్సలతో పాటు ఒక నెలకు సరిపడు మందులను కూడా పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. కావున వృద్ధులు పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఆరోగ్యంగా ఉండాలని వారు తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని వాల్మీకులందరూ కూడా శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఎదురుగా గల వాల్మీకి విగ్రహానికి వాల్మీకి సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ కూడా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో అందరూ నడవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బోయ రవిచంద్ర, తలారి చంద్రమోహన్, బొట్టు కృష్ణ, చీమల రామాంజి, చీమల సూరి, చీమల నాగరాజు, జింకల రాజన్న, టైలర్ గోపాల్, అంకె దుర్గేష్, పూజా మొబైల్ సాయి, పూలకుంట్ల మహేష్ ,డిష్ లచ్చి,అనంతయ్య పాల్గొన్నారు.

ప్రజలకు న్యాయం చేస్తాం

విశాలాంధ్ర-ధర్మవరం: డివిజన్ ప్రజలకు అన్ని విధాల న్యాయం చేకూర్చడం జరుగుతుందని నూతన ఆర్డీవో జీ.రమేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం ఆర్డిఓ కార్యాలయంలోని తన చాంబర్లో పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాల యంలోని అధికారులు సిబ్బంది బొకేలుఇచ్చి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పెండింగ్ సమస్యలన్నీ కూడా నా శక్తివంచన మేరకు తప్పక పరిష్కరిస్తానని వారు తెలిపారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని అందరు తాహసిల్దార్లు కూడా ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించ కుండా పూర్తి దశలో న్యాయం చేసేలా తాహసిల్దార్లకు తగిన సూచనలు కూడా ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఏ ఓ కతిజున్ కుబ్రా, డిప్యూటీ ఎమ్మార్వో లక్ష్మీదేవి, అంపయ్య, డివై ఎస్ ఓ గోపాల్, ప్రసాదు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ఉచితంగా వైద్యం

విశాలాంధ్ర-బత్తలపల్లి: ఇంటింటికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీపీ బగ్గిరి త్రివేణిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సంజీవపురం గ్రామంలో స్థానిక సర్పంచ్ కమతం వరలక్ష్మీ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఇంటింటికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను పంపి వారి ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు. ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి మనోహర్, జడ్పీటీసీ కోటి సుధా, వైకాపా మండల కన్వీనర్ జయరామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాంభూపాల్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగిరి భయపరెడ్డి, మాజీ సర్పంచ్ ముల్లగూరి సంజీవ్, కమతం ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల మాధవ్ వెధవ చేష్టలు మానుకో..

విశాలాంధ్ర-రొళ్ల: హిందూపురం పార్లమెంట్ సభ్యుడు గోరంట్ల మాధవ్ నీ వెధవ చేష్టలు మానుకోవాలని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు బాలకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీ దుర్మార్గపు మాటలతో ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారని, గోరంట్ల మాధవ్ రోజురోజుకు సైకో లాగా తయారవుతున్నారని, ఇప్పటికైనా నారా చంద్రబాబు నాయుడుకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు గురించి మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని వారు హితవు పలికారు. లేకుంటే నీవు ఇలాగే మాట్లాడితే మడకశిర నియోజకవర్గం తెలుగు యువత తరపున నీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. 2024లో తెలుగుదేశం అధికారంలోకి రాగానే నీ భరతం పడతామని తీవ్రంగా హెచ్చరించారు.

విలేఖరి పై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పు

విశాలాంధ్ర-సోమందేపల్లి: గోరంట్ల మండల విలేఖరి ఈశ్వర్ రాయల్ పై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి ముప్పు అని సోమందేపల్లి మండల బలిజకుల సోదరులు ఖండించారు. శనివారం స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ శంకర్, సి ఎస్ డి టి గిరిధర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగవ పిల్లర్ గా ఉంటూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలు అక్రమాలను ప్రభుత్వ విధానాలను, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసే ప్రశ్నించే జర్నలిస్టులపై దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్య తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జవాజి రమేష్, ఆదిమూర్తి, కళ్యాణ్, ముద్దప్ప, రమేష్, ప్రజాశక్తి నవీన్, డాక్టర్ సూర్యనారాయణ, ఎల్ఐసి రంగనాథ్, పులివెందల నారాయణస్వామి, రామదాసు, తదితర బలిజ కులస్తులు పాల్గొన్నారు.

ఆర్టీసి బస్టాండులో లక్కీ డ్రా

విశాలాంధ్ర-లేపాక్షి: ఆర్టీసీ యాజమాన్యం వారు శనివారం ఉదయం లక్కీ డ్రా తీసినట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ హంపన్న, స్థానిక ఆర్టీసీ కంట్రోలర్ భాషాలు తెలిపారు. హిందూపురం-కొడికొండ చెక్పోస్టుకు వేళ్లే పల్లె వెలుగు బస్సుల్లో గిఫ్టి బాక్సు ఏర్పాటు చేసామని తెలిపారు. అయితే ప్రయాణికులు బాక్సులో వేసిన టికెట్లు మీద వున్న అడ్రస్లు ఆధారంగా ప్రతి నెల లక్కీ డ్రా తీయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే లక్కీ డ్రాను ఓబాలుడితో తీయించారు.మొదటి బహుమతి సుమ, రెండవ బహుమతి వెంకటేష్, మూడవ బహుమతి లావణ్యలు ఎంపియ్యారని,ఈ బహుమతులను హిందూపురం పట్టణంలోని డాక్టర్ అనీల్ వారి సౌజన్యంతో ఇవ్వడం. జరుగుతుందని, లాటరీలో ఎంపికైన వారు సెలెనెంబరు 7382863007, 73828661308 ద్వారా బహుమతులన పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా కంట్రోలర్ మాట్లాడుతు గిఫ్ట్ బాక్సులు ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేయడం వలన ప్రయాణికులు ఆదరణ పెరగడమే కాకుండా సంస్థకు ఆదాయం ఆశాభావం వ్యక్తం చేసారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-రొళ్ల: ప్రతి ఒక్క కార్డు లబ్ధిదారుడికి నిత్యవసర వస్తువులు సక్రమంగా అందించాలని తూకాల్లో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హసీనా సుల్తానా హెచ్చరించారు.శనివారం డీలర్లు ఎం.డి.యూ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చౌక ధాన్యపు దుకాణంలో నిత్యవసర సరుకులను ప్రతి ఒక్క కార్డుదారునికి ఎండియూ ఆపరేటర్లు చౌక ధాన్యపు దుకాణంలో ఇవ్వకుండా గ్రామాల్లో వెళ్లి తమ ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేయాలని ఎం.డి.యూ ఆపరేటర్లకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణంలో నిల్వల్లో తూకాల్లో తేడా వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఆర్.ఐ ఉమేష్,డీలర్లు ఎం.డి.యూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో రాజీ పడొద్దు

విశాలాంధ్ర-నల్లచెరువు : నల్లచెరువు మండలంలో అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు అని ఎంపీపీ రమణారెడ్డి అధికారులకు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శకుంతల ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షత వహించారు.ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలనుఅధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. ఏ గ్రామ సమస్యలు అదే గ్రామంలో పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. పరిష్కారం నోచుకోని ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పంచరత్నమ్మ, ఎస్సై లింగన్న మండల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు మహొత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 45వ ఉరుసు మహొత్సవ వేడుకలు ఈనెల 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా అజీమ్ అల్ సుల్తాన్ మైనారిటీ చారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఈనెల 26వ తేదీ గంధము 27వ తేదీ ఉరుసు చివరి రోజు 28న జీహేర కార్యక్రమాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ ఉరుసు కార్యక్రమానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కాచెర్ల లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ శంషాద్ వేముల జయరామిరెడ్డి, పదవ వార్డు ఇన్చార్జ్ కృష్ణాపురం జమీర్, 38 వార్డు ఇన్చార్జ్ రమణారెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ కరీం,ముత్తు వల్లి జామియా మసీదు-ముస్తాక్ అహ్మద్, జాకీర్ హుస్సేన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చందమూరి నారాయణరెడ్డి పాల్గొన్నారు. తదుపరి ట్రస్ట్ అధ్యక్షుడు నాసిర్ అహ్మద్ విరాళాలు ఇచ్చిన దాతలు పేరిట నమాజులు, చదివింపులు చేసిన తదుపరి, అందరిని కూడా ఘనంగా సన్మానించారు. ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ పేరుపేరునా ట్రస్ట్ అధ్యక్షుడు నాసిర్ అహ్మద్ తోపాటు చారిటీ ట్రస్ట్ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండఅటవీ శాఖా అధికారి కి శనివారం పేద సాగు దారులతో కలిసి వినతి పత్రం అందజేశారు. రొద్దం మండలం కోగిర రెవెన్యూ పొలంలో 669 సర్వే నంబర్లలో గల ప్రభుత్వ మిగులు భూమిని కోగిర , శ్యాపురం , కంబాలపల్లి , బొక్సంపల్లి , బీదాను పల్లి గ్రామాలకు చెందిన దళిత, గిరిజన, బలహీన వర్గాల భూమి లేని నిరుపేదలు (కందులు , జొన్నలు , కొర్రలు) పంట సాగు చేస్తున్నారు . వీటిని అసైన్మెంట్ చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని సంబందించిన రెవిన్యూ అధికారులను విజ్ఞప్తులు చేశాము. అధికారులు మా పరిధి కాదు , సదరి భూమి అటవీ భూమి అని తెలిపారు.పేదలకు న్యాయం జరిగే విధంగా పై సర్వే నంబర్లలో ఉన్న భూమి , మరియు పేదలు సాగులో ఉన్న భూమి తమ శాఖా పరిధిలో వుందా లేదా అనే వివరాలు తో పాటు ఒక వేళ పేదల సాగు భూమి తమ పరిధిలో ఉంటే చట్టం ప్రకారం పేదలకు హక్కులు కల్పించి న్యాయం చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఏ కార్యక్రమంలో పెద్దన్న గంగాధర్ జనారాయణ , వెంకట్ రాముడు , హనుమయ్య , వెంకటేశులు అనితమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం...

విశాలాంధ్ర-కొత్తచెరువు: మేజర్ గ్రామపంచాయతీలో సమస్యలు తీవ్రంగా పేరుకుపోయిన అధికారులు వాటి గురించి పట్టించుకోకపోవడంతో పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తచెరువు లోనే బసవన్న కట్ట ముస్లిం కాలనీలో గడపగడపకు కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వం నుండి అందుతున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి తీసుకువస్తే అధికారులతో వాటిని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈ కాలనీలో పంచాయతీ కార్యదర్శి గాని, సర్పంచ్ గాని వచ్చిన దాఖలు లేవని, దీనితో సమస్యలు పేరుకపోయినాయని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్య, మురుగునీటి కాలువ లో డ్రైనేజీ శుభ్రం చేయకపోవడంతో అవి రోడ్డు మీద పారుతున్నాయి అన్నారు. తాగునీరు సరఫరా కుళాయిల ద్వారా సక్రమంగా వదలడం లేదని దీనితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అలాగే రహదారులు ఆక్రమించుకోవడంతో వాహనాలు రాకపోకలు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఆయనను కోరారు. పంచాయతీ కార్యదర్శి గోపాల్ విధులు సక్రమంగా నిర్వహించి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని, అలా చేయని పక్షంలో విధుల నుండి వెళ్లిపోవాలని ఆయనకు సూచించారు. అలాగే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పలువురు మహిళలు ఆయనను కోరారు. మైలేపల్లి నాగిరెడ్డిపల్లి వద్ద స్థలాలను పరిశీలిస్తున్నామని త్వరలోనే వాటిని పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సర్పంచ్ రాధా నాగరాజు, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, జెడ్పిటిసి గంగాదేవి శంకర్, వైసీపీ నాయకులు వాల్మీకి శంకర్, షాజహాన్, అంగడి సోము, సత్తి, భాస్కర, నాగభూషణ్, మాధవరెడ్డి, పాపన్న, పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, తాహసిల్దార్ రామాంజనేయరెడ్డి, ఎంపీడీవో భారన్ సాబ్, ఏవో నటరాజు, ఎంఈఓ జయచంద్ర, ఈవోఆర్డి సిద్ధారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ జేఈ ఓబులేసు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలను నమ్మకముతో పని చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం : పార్టీ బాధ్యతలను నమ్మకంతో పనిచేసే పార్టీకి మంచి పేరు గుర్తింపు తీసుకొని రావాలని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ విస్తృత సాయి సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులకు గుణపాఠం చెప్పే రోజులు చాలా దగ్గరలో ఉన్నాయని తెలిపారు. కొందరు వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, అదేవిధంగా దాడులు చేయడం, చెట్లు నరకడం, బోర్లు పూడ్చడం వంటివి చేస్తున్నారని చెబుతూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే నేరుగా ఎదుర్కోవాలి తప్ప, బ్రతుకులు ఇచ్చే వాటి పై దాడి చేయడం పిరికిపంద చర్య అని తెలిపారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పార్టీ ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలని నాయకులకు క్యాడర్లకు దిశా నిర్దేశం చేశారు.చంద్రబాబు నాయుడు జైలుంటి బయటకు వచ్చేంతవరకు వివిధ దశల్లో న్యాయ పోరాటాలు చేస్తామని తెలిపారు. నాయకులు కార్యకర్తలు సైనికుల పనిచేసినప్పుడే, మనకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను బలంగా చేపట్టాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి సూపర్ సిక్స్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని సూచించారు. అదేవిధంగా ఎటువంటి నేరం చేయని చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్టు చేసిన విధానాన్ని ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. ప్రతి నాయకుడు కార్యకర్త ప్రతిరోజు 10 ఇళ్ల వద్దకు వెళ్లాలన్నారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకు ఈ కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. వైసీపీ నాయకులు ఒక్కటే గుర్తుపెట్టుకోవాలని తెలుపుతూ రాష్ట్రానికి ఎంతో మంచి చేసిన చంద్రబాబు నాయుడు లాంటి వ్యక్తులను జైలుకు పంపించినప్పుడు భవిష్యత్తులో మీ పరిస్థితి ఏంటి అన్నది ఊహించుకోవాలని తెలిపారు. పదుల సంఖ్యలో ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎందుకు అరెస్టు చేయలేదని వారు ప్రశ్నించారు. చివరకు న్యాయమే గెలుస్తుందని నాయకులకు కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద జిల్లా టిడిపి అధ్యక్షులు, బికే పార్థసారథి అధ్వర్యంలో శనివారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందుగా వాల్మీకి చిత్రపటానికి మరియు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం పార్థసారథి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టు, పార్టీ శ్రేణులపై జరిగిన దమనకాండ, జగన్ రెడ్డి కక్షపూరిత చర్యలను బి కే పార్థసారథి కార్యకర్తలకు వివరించారు. ఓటమి భయంతోనే సీఎం జగన్ వ్యవస్థల్ని అడ్డుపెట్టుకొని చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులతో రాజకీయకక్ష సాగిస్తున్నారు. మండల పరిధిలోని గుట్టూరు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు పార్థసారథి నేతృత్వంలో టిడిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం పంపిణీ

విశాలాంధ్ర-కొత్తచెరువు: ఇటీవల కర్ణాటకలోని చిక్బలాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం మంజూరు కావడంతో పుట్టపర్తి ఎమ్మెల్యే డి.శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేశారు. కొత్తచెరువు మండలం గోరంట్ల పల్లికి చెందిన హరిజన పవన్ కుమార్ మృతి చెందాడు. ఈయన భార్య కుల్లాయిమ్మకు ఐదు లక్షల చిక్కును, అలాగే ఓడిసి మండలం వెంకటనా రాయణ సుబ్బమ్మ మృతిచెందగా వారి కుమారులైన రాజశేఖర్ రాజేష్ లకు ఐదు లక్షల చెక్కులను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కుటుంబాలను అన్ని విధాల ప్రభుత్వము ఆదుకుంటామ న్నారు. ఇంకా ప్రభుత్వపరంగా రావాల్సింది త్వరలోనే అందజేస్తామని, మీరు ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, తాహసిల్దార్ రామాంజనేయరెడ్డి, మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, జడ్పిటిసి గంగాదేవి, వైసీపీ నాయకులు రెడ్డప్ప రెడ్డి, వాల్మీకి శంకర్, షాజహాన్, నాగరాజు, సోమశేఖర్ రెడ్డి, భాస్కర, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో రికార్డుల పరిశీలన

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ కోర్టులో శనివారం రికార్డుల పరిశీలన కోసం హిందూపురం 2వ అదనపు జిల్లా జడ్జి శైలజ విచ్చేశారు ఈ సందర్భంగా ఆమెను పెనుకొండ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ వసల సయ్యద్ తో కలసి రికార్డుల పరిశీలన అనంతరం ఆమె బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగరాజు అధ్యక్షత న జరిగిన మీటింగ్ నందు కోర్టుల్లో సౌకర్యాలు, కోర్టు కేసుల త్వరగా విచారణ పూర్తి చేయుటకు సహాయ సహకారాలు గురించి చర్చించారు. అదే విధంగా బార్ అసోసియేషన్ హల్ నందు సౌకర్యాలు పరశీలించి న్యాయవాదులను అభినందించారు. ఈ కార్య క్రమములో న్యాయవాదులు మోహన్ నాయక్, శ్రీనివాసులు, నాగార్జున, నాగిరెడ్డి, జావిద్, విక్రంత్ నాయక్, జయకళ, పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజారోగ్యానికి రక్ష

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని కెరికిర వన్ సచివాలయం ఎల్ ఆర్ జీ స్కూల్ ఆవరణమునందు, కిరీకెర పంచాయతీ సర్పంచ్ భాగ్యముక్తి ఆధ్వర్యంలో,శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హిందూపురం నియోజకవర్గం ఇన్చార్జి టిఎన్. దీపిక పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పేదప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడకుండా, ఇంటి వద్దకే వైద్యాన్ని అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. కంటి పరీక్షల చేయించుకున్న వారికి కంటి అద్దాలును, వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లను పంపిణీ చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. గర్భవతులు శీమంతాలులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వైద్య అధికారులు, మండల నాయకులు, ఐసిడిఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి జనాలను తీసుకెళ్లే వాహనాలపై చర్యలు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల కేంద్రంలోని అనంతపూర్ కదిరి హైవే నందు, తన పోలీసు సిబ్బందితో వాహనాలు తనిఖీ చేసి, పరిమితికి మించి ఎక్కువ జనాలను తీసుకుపోతున్న వాహనాలను ఆపి, డ్రైవర్లకు మరియు ప్రజలకు ప్రమాదాల గురించి వారికి అవగాహన కల్పించి, అందర్నీ వేరే వేరే వాహనాలలో పంపడమైనది, ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సై వంశీకృష్ణ మాట్లాడుతూ, పరిమితికి మించి ఎక్కువ ప్రజలను తీసుకెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తప్పవు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి గా ధరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నరసింహ, భాస్కర్,హెూంగార్డ్స్ వెంకటనారాయణ, లోకనాథ్ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల వారోత్సవాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-ఎన్‌పీకుంట: పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో శనివారం నంబులపూలకుంట మండలంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులకు నంబులపూలకుంట పోలీస్ స్టేషన్ నందు ఓపెన్ హౌస్ కార్యక్రమము నిర్వహించి విద్యార్థులకు పోలీస్ విధి విధానాలు గురించి తెలియజేశారు. కేసుల వివరాలు, లాక్ అప్, పోలీస్ విధులు, కమ్యూనికేషన్ లో మాట్లాడించటం తదితర విషయాలు తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు,ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోండి

విశాలాంధ్ర -కొత్తచెరువు: వాల్మీకి మహర్షిని సమాజంలో ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా శనివారం కొత్తచెరువులోని బుక్కపట్నం రోడ్ లో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు బండ్లపల్లి రాజు, ఆది, లక్ష్మీనారాయణ, చింతకాయల కిష్టప్ప, నరసింహులు, వాల్మీకి శంకర్, ఎల్లప్ప, అశోకు, రాము, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పెనుకొండ పట్టణం లోని తెదేపా కార్యాలయం నందు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలం లోని ఇస్లాపురం గ్రామంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆమెతోపాటు సీనియర్ టీడీపీ నాయకులు, వాల్మీకి కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వాల్మీకి కులస్తులు శనివారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. జయంతి కార్యక్రమంలో పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి సవితమ్మ వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, ఎంపీటీసీలు నాగప్ప, పూజారి ఈశ్వరయ్య, మాజీ సింగల్ విండో చైర్మన్ ఆంజనేయులు, నీరుగంట చంద్రశేఖర్, వార్తా శ్రీనివాసులు,వాల్మీకి సోదరీ సోదరీమణులు గ్రామస్తులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని లేపాక్షి, కల్లూరు, కొండూరు, కోడిపల్లి, మానేపల్లి, శిరివరం తదితర గ్రామాల్లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకులు శనివారం ఉదయం ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేసారు. లేపాక్షి పంచాయతీ పరిధిలోని గలిబి పల్లిలో వాల్మీకి దేవాలయ నిర్మాణానికి సర్పంచ్ ఆదినారాయణ గర్భగుడికి టైల్స్ విరాళంగా అందజేశారు.

ఓడిసీరూరల్: శనివారం ఓబుల దేవర చెరువు మండలం గౌరపురంలో వాల్మీకి సోదరులు వాల్మీకి జయంతి వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి విగ్రహానికి ఘణంగా నివాళులర్పించారు. అనంతరం రామ భజనలు, కీర్తనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేషి, అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలోవాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం, స్ఫూర్తి దాయకం అని, వారు ఆది కవి, మహా కవి అని డిఆర్ఓ కొండయ్య పేర్కొన్నారు.శనివారం సాయి ఆరామం సమావేశ మందిరంలో వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన జిల్లా స్థాయి వాల్మీకి జయంతి కార్యక్రమంలో డిఆర్ఓ ముఖ్య అతిథిగా పాల్గొని వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్పర్సన్ ఓబుళపతి, రాజు కులాయప్ప బాలాజీ నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

బుక్కపట్నం : వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అగ్రహారం, పాముదుర్తి , కృష్ణాపురం తదితర గ్రామాలలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు ఎర్ర కేసి, మాజీ ఎంపీపీ బాలు,గొర్ల కృష్ణ, మోహన, అక్కులప్ప,రామకృష్ణ,టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బ మండల కేంద్రంలోని పాము దుర్తి క్రాస్ రోడ్ లో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి మండలంలో ఉన్న వాల్మీకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం మురళి, బాలచంద్ర, ఎంపీటీసీ శివమ్మ రామకృష్ణ, సర్పంచులు చంద్ర, క్రిష్టయ్య, శంకర్,పవన్,హరి,నాగర్జున, రాజేష్,ఎర్రప్ప పాల్గొన్నారు.

గోరంట్ల: గోరంట్ల పట్టణంలోని బస్టాండ్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన వాల్మీకి విగ్రహం వద్ద వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అరుణమ్మ, విజయ కుమార్,శ్రీనివాసులు, వేణు తదితరులు పాల్గొన్నారు.